క్లుప్తంగా

రేపు వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి

• మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : ఈ నెల 2న దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వాడవాడల ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు మహానేతకు నివాళులర్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పునఃప్రారంభించాలని వినతి



ఎంపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న మాడుగుల యువకులు

మాడుగుల: పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పునఃప్రారంభించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కార్యాలయానికి పట్టణానికి చెందిన డేరింగ్ బాయ్స్ యువకులు విపతి పత్రం శనివారం అందజేశారు. ఎంపీ సీఎం రమేష్ కార్యాలయంలో లేకపోవడంతో ఆయన తనయుడు రిత్విక్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి ఎంపీ తనయుడు రిత్విక్‌తో పాటు కార్యాలయ సిబ్బంది స్పందించడంతో డేరింగ్ బాయ్స్ యువకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి సంతాపం

మాకవరపాలెం: తామరం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారపురెడ్డి రాజారావు అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజారావు శనివారం మృతి చెందడంతో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మితో పాటు మండలంలోని ఉపాధి పథకం సిబ్బంది సంతాపం తెలిపారు.

నూతన ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం



మాకవరపాలెం: ఎస్‌ఐ దామోదరనాయుడు శనివారం విధుల్లో చేరారు. వి.మాడుగులలో పనిచేస్తున్న దామోదరనాయుడు ఇటీవల జరిగిన ఎస్‌ఐల బదిలీల్లో మాకవరపాలెం బదిలీ అయ్యారు. శనివారం బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల విషయమై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

తల్లి పేరున మొక్కలు నాటాలి

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ పచ్చదనం మెరుగుపర్చేందుకు మొక్కను నాటాలని కె.కోటపాడు ఐసీడీఎస్ పీవో మంగతాయారు అన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి శనివారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ తల్లిపేరున ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని, అలాగే మొక్కను సంరక్షించే బాధ్యత చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.కుమారి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

గొలుగొండ: మండలంలో చీడిగుమ్మల గ్రామంలో శనివారం స్పీకర్ అయ్యన్న పర్యటనలో మండల, పంచాయతీ స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సర్పంచ్ కాపారపు చినబ్బాయి, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చీడిగుమ్మలలో స్పీకర్ అయ్యన్న పర్యటన దృష్ట్యా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీకి కనీసం సమాచారం అందించకపోవడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఎస్ఎంసీ చైర్మన్ల ఎన్నిక

బుచ్చెయ్యపేట: మండలంలో కె.కొండెంపూడి, సీతయ్యపేట గ్రామాల్లో పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వడ్డాది కేజీబీవీ పాఠశాలలో చైర్‌పర్సన్‌గా యడ్ల సత్యవేణి, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, సీతయ్యపేట హైస్కూల్ చైర్మన్‌గా పిల్లా మహేష్, వైస్ చైర్‌పర్సన్‌గా పద్మ, కె.కొండెంపూడిలో చైర్‌పర్సన్‌గా శ్రీదేవి, వెస్ చైర్మన్‌గా ఆది మహేష్ ఎన్నికయ్యారు.

దేవరాపల్లి : తెనుగుపూడి బి.ఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. చైర్మన్‌గా నర్సింహమూర్తి, వైస్ చైర్మన్‌గా లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ రహదారిలో ప్రయాణం ఎలా..!



రోడ్డు మధ్యలో గోతుల్లో వర్షం నీరు

- రెండు జిల్లాలను అనుసంధానం చేసే రహదారి
- అధ్వానంగా నాతవరం–తాండవ రోడ్డు
- మూడు మండలాల ప్రజల రాకపోకలకు ఆధారం
- అడుగుకో గొయ్యి, వర్షం పడితే చెరువే
- తరుచూ ప్రమాదాలు..ప్రైవేటు వాహనాల రాకపోకలు బంద్



మట్టిరోడ్డుగా మారిపోయిన తాండవ వెళ్లే తారురోడ్డు

నాతవరం : రెండు జిల్లాలను అనుసంధానం చేసే అర్అండ్‌బీ రోడ్డు శిథిలం కావడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అనేక బాధలు పడుతున్నారు. మండల కేంద్రం నాతవరం నుంచి తాండవ రిజర్వాయరు వరకు సుమారుగా 8 కిలోమీటర్ల అర్అండ్‌బీ రోడ్డు అడుగుకో గొయ్యితో ఏమాత్రం వర్షం పడినా నీరంతా రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా శిథిలం కావడంతో తారురోడ్డు మట్టి రోడ్డును తలపించేలా దర్శనమిస్తుంది. ఈ రోడ్డు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి అనుసంధానం చేసే ప్రధాన రోడ్డు. అదే విధంగా నాతవరం గొలుగొండ కొయ్యూరు మండలాలను అనుసంధానం చేసే ఈ రోడ్డుపై ఆధారపడి మూడు మండలాల పరిధిలో సుమారుగా 25 పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

జిల్లాలో ఏకైక మేజరు ప్రాజక్టు తాండవ రిజర్వాయరుకు వెళ్లేందుకు ఈరోడ్డే కీలకం. నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నరకం చూస్తున్నారు. రోడ్డుపై పెద్ద గోతులు పడడంతో రాత్రిపూట ప్రయాణించే వారు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. తాండవ రిజర్వాయరును చూసేందుకు దూర ప్రాంతాలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు నిత్యం ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు శిథిలం కావడంతో ఆటోలు ఇతర ప్రైవేటు వాహనదారులు ఈ ప్రాంతంలో గ్రామాలకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ చుట్టు పక్కల గ్రామాల్లో విద్యార్థులు కాలేజీలకు వెళ్లడానికి అనేక కష్టాలు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న పెద్ద గోతులు కప్పి కనీస మరమ్మతులు చేయకపోతే తాండవ తిరిగే ఆర్టీసీ బస్సును సైతం నిలుపుదల చేస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో 108 వాహనం ఇతర ప్రైవేటు అంబులెన్సులు సైతం ఈ రోడ్డుపై గోతులను చూసి ఈ ప్రాంత గ్రామాలకు రావడానికి భయపడుతున్నారు.

రాకపోకలకు ఇక్కట్లు



తాండవ నాతవరం మధ్య రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలు సాగించేందుకు మేము నానా యాతన పడుతున్నాం. ప్రైవేటు వాహనాలు రావడం లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు రోడ్డుపై ఉన్న గోతుల్లో పడి తరుచూ మొరాయిస్తున్నాయి. ఆర్టీసీ బస్సు అన్ని వేళలా అందుబాటులో ఉండడం లేదు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, వైద్యం కోసం ఆస్పత్రికి ఈ రోడ్డులో వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా తయారై ఏమాత్రం రాకపోకలు సాగించలేం.

– వై.సందీప్, పీజీ విద్యార్థి, చమ్మచింత

ఆందోళన చేస్తాం



తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డుపై ప్రయాణించేందుకు కనీసం మరమ్మతులైనా చేపట్టకపోతే ఆందోళన చేస్తాం. ఇటీవల ఈ రోడ్డును మా సీపీఎం జిల్లా బృందం స్వయంగా పరిశీలించి ఈ ప్రాంతీయులు పడే బాధలను అధికారులు దృష్టికి తీసుకెళ్లాం. రెండు జిల్లాలను అనుసంధానం చేస్తూ మూడు మండలాల ప్రజల రాకపోకలకు ఆధారమైన ఈ రహదారిని నిర్లక్ష్యం చేయడం తగదు. దీనిని బాగు చేయకపోతే ఆందోళన చేస్తాం.

– అడిగర్ల రాజు, సీపీఎం మండల పార్టీ కార్యదర్శి

విధి నిర్వహణలో అంకితభావం స్ఫూర్తిదాయకం



వీఆర్వో కృష్ణకుమార్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్



మల్లేశ్వరరావును దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుమూర్తి

కె.కోటపాడు: ఉద్యోగ నిర్వహణను అంకిత భావంతో నిర్వహించే ప్రతి ఉద్యోగికి ప్రజలతో పాటు ఉన్నతాధికారుల నుండి తప్పక గుర్తింపు ఉండనున్నట్లు పెందుర్తి మండల విద్యాశాఖాధికారి టి.మధుమూర్తి అన్నారు. బి.కింతాడ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన ఈమంది మల్లేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఎ.కోడూరులో ఆయనను శనివారం ఎంఈవో మధుమూర్తి ఘనంగా సన్మానించారు.ఎందరో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులను 38 ఏళ్ళుగా అందించిన మల్లేశ్వరరావు పలువురికి ఆదర్శమని మధుమూర్తి అన్నారు. కార్యక్రమంలో కె.కోటపాడు, గోపాలపట్నం పీఆర్‌టియూ అధ్యక్షులు సూర్రెడ్డి శ్రీనివాసరావు, బండారు పేరునాయుడు, ప్రవీణ్, మొహిద్దీన్ పాల్గొన్నారు.

వీఆర్వో కృష్ణకుమార్‌కు సన్మానం

ఆర్.వై.అగ్రహారం వీఆర్వోగా పని చేసిన ఎం.కృష్ణకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలతో అందరి మన్ననలను కృష్ణకుమార్ పొందినట్లు డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ అభినందించారు.కార్యక్రమంలో ఆర్ఐ జానకి, గాయత్రి, కిషోర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వడ్డాది, కేపీ అగ్రహారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కేపీ అగ్రహారంలో శ్రీకృష్ణ ఆకారంలో వెలిగించిన దీపాలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి, కేపీ అగ్రహారంలో శ్రీకృష్ణుని ఆలయంలో శనివారం శ్రీకృష్ణ నవమి వేడుకల్లో భాగంగా విశేష పూజలు చేశారు. వెయ్యి దీపాలతో శ్రీక్రిష్ణుడి ఆకారంలో దీపాలు వెలిగించి ఆలయాన్ని అలంకరించారు. భక్తి గీతాలు ఆలపించారు. శ్రావణ మాసం ఆఖరి వారం పురస్కరించుకుని వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా పలు గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కేపీ అగ్రహారంలో కొండపాలెం, ఐయితంపూడి, పైడంపేట తదితర గ్రామాల భక్తులు తరలివచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నీటిలో గంబూషియా చేప పిల్లల విడుదల

గొలుగొండ : దోమల వ్యాప్తి వల్ల వ్యాధులు పెరుగుతున్నాయని, వీటిని కొంతమేర అరికట్టడానికి చిన్న చిన్న కాలువల్లో, నీటి గుంతల్లో గంబూషియా చేప పిల్లలు విడుదల చేసినట్టు గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. జోగుంపేట, గొలుగొండ ప్రాంతాల్లో ఈ చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ దోమల పెరుగుదలను అరికట్టడానికి ఈ గంబూషియా చేప పిల్లలు చాలా మేలు చేస్తాయని చెప్పారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

• స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అయ్యన్నపాత్రుడు సందర్శించారు. కళాశాలలో ఉన్న కోర్సుల వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు స్పీకర్ దృష్టికి తీసుకువెళ్ళారు. కళాశాల అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా కంప్యూటర్స్, సెమినార్ హాల్, సౌండ్ సిస్టం, సెమినార్ హాల్‌లో కుర్చీలు, సైకిల్ షెడ్డు, జిమ్ నిర్మాణానికి తగిన నిధులు సమకూరుస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం అధ్యాపకులతో కలిసి కళాశాలలో మొక్కలు నాటారు.

అల్పపీడనంతో జోరుగా వర్షాలు

నదుల్లో చేరిన వర్షపు నీరు



కె.జె.పురం వద్ద పొంగి ప్రవహిస్తున్న తాచేరు నది

జలాశయం	గరిష్ట	ప్రస్తుతం	సాగు (ఎకరాలు)
రైవాడ	114 మీ	108.15మీ	22000
పెద్దేరు	137 మీ	135 మీ	19000
కోనాం	101.25 మీ	97.75మీ	14000



వి.సంతపాలెంలో పొలాలను పరిశీలించిన ఏడీ రవీంద్రనాథ్

మాడుగుల రూరల్ : అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తాచేరు, శారద, నదులల్లో వర్షపు నీరు చేరింది. దీంతో పాటు చెరువుల్లో పుష్కలంగా నీరు చేరింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 32.6 మిల్లీ మిటర్లు వర్షపాతం నమోదు అయిందని స్థానిక తహసీల్దారు పి.వి.రత్నం తెలిపారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటలు వరకు 6.8 మిల్లీ మిటర్లు వర్షపాతం నమోదైందన్నారు. తుపాను దృష్ట్యా పెద్దేరు, తారకరామ, గొర్రిగెడ్డ, ఉరకగెడ్డ, పాలగెడ్డ, జలాశయాల్లో నీరు చేరుతుందని, పెద్దేరు జలాశయం పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

స్తంభించిన జనజీవనం

బుచ్చెయ్యపేట : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముందుగానే ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో శనివారం విద్యార్థులకు వర్షం కష్టాలు తప్పాయి. పెద్దేరు,తాచేరు,బొడ్డేరు నదులు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వడ్డాదిలో పెద్దేరు నదిపైన, విజయరామరాజుపేట తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్లను ఆనుకుని వర్షం నీరు ప్రవహించడంతో వాహనదారులు నెమ్మదిగా రాకపోకలు సాగించారు. పలు గ్రామాల్లో రోడ్డు గోతుల్లో చేరిన వర్షం నీటిలో నుంచి వెళ్లడానికి వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రోజువారి కూలీల పనులుకు ఇబ్బందులు పడ్డారు.

కె.కోటపాడు : బంగాళాఖాతంలో ఎర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుండి శనివారం వరకూ పలు సమయాల్లో వర్షం కురిసింది. అల్పపీడన ద్రోణి కారణంగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగులో వరి, చెరకు పంటలను సాగు చేస్తున్న రైతులకు మేలు చేకూరుస్తుందని సాగు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో సాగునీటి చెరువుల్లోకి వర్షపునీరు చేరుకుంది.

ముంపులో ఉన్న పొలాల పరిశీలన

కె.కోటపాడు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నట్టు చోడవరం వ్యవసాయశాఖ ఏడీ వి.రవీంద్రనాథ్ తెలిపారు. వి.సంతపాలెం, వారాడ గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన వర్షాల కారణంగా ముంపులో ఉన్న పంట పొలాల రైతులకు ఆయన సూచనలు చేశారు. పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్లేందుకు చిన్నచిన్న కాలువలను ఏర్పాటు చేయాలని వివరించారు. నీటి ముంపు కారణంగా పంటలకు కుళ్లు, పాసి తెగుళ్ల సోకే అవకాశాలు ఉన్నాయని, తెగుళ్ల రాకుండా రైతులు ముందస్తుగా 2 ఎంఎల్‌ల హెక్సాకోనజోల్ మిశ్రమాన్ని 2 లీటర్ల నీటిలో వేసి పంటకు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్, ఏఈవో లైలాదేవి పాల్గొన్నారు.

రోలుగుంట: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పొలం నీట మునగకుండా రైతులు సంరక్షించుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి హెచ్చరికలు జారీ చేశారు. జె.పి.అగ్రహారం, కొంతలం, వెలంకాయలపాలెం తదితర గ్రామాల్లో లేటుగా వరినాట్లు జరుగుతున్నాయి. తాజా వర్షాలతో మళ్లీ వరినాట్లు దెబ్బతినే అవకాశం ఉందని అందువల్ల నీటిని బయటకు పంపి సంరక్షించుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.

నిండుకుండల్లా జలాశయాలు

మాడుగుల : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావానికి నియోజకవర్గంలో శనివారం అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయని, ఖరీఫ్ వరి చేలకు జలాశయాల ఆయకట్టు భూములకు ఢోకాలేదని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో దేవరాపల్లి, మండలంలో వారాడ నారాయణమూర్తి(రైవాడ,) చీడికాడ మండలంలో (వేచలపుపాలవెల్లి)కోనాం, మాడుగుల మండలంలో తెన్నేటి విశ్వనాథం,(పెద్దేరు,) జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. మూడు జలాశయాలు పరిధిలో సుమారు 55వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశారు. మెట్ట భూముల్లో వేసిన పంటలకు కూడా సాగు నీటికి ఇబ్బంది లేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వెంకన్నపాలంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇచ్చిన ఎంపీ, ఎమ్మెల్యే



వెంకన్నపాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ రమేష్, ఎమ్మెల్యే రాజు



కె.కోటపాడులో పింఛను పంపిణీని పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి నాగలక్ష్మి



బుచ్చెయ్యపేటలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న డీపీఓ శిరీషారాణి

చోడవరం: పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్ అన్నారు. మండలంలో వెంకన్నపాలెంలో జరిగిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజుతో కలిసి ఈ గ్రామంలో కొన్ని ఇళ్లకి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి ఎంతో కృషిచేస్తున్నాయన్నారు. ఒకేసారి రూ. 4వేలకు పింఛన్ పెంచి ఇవ్వడమనేది సాహసోపేత నిర్ణయేమన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల సమస్యలతోపాటు మౌలిక సదుపాయల సమస్యలు కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బూరా వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మచ్చిరాజు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలో పింఛన్ల పంపిణీ మొదటిరోజు 10927 మందికి అందజేశారు.మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఎంపీడీవో అప్పలరాజు పర్యవేక్షించారు. గ్రామస్థాయిలో సచివాలయ, వివిధ శాఖల ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు.

మాడుగుల : మండలంలో 11,769 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 11,180 మందికి శనివారం పంపిణీ చేయడం జరిగిందని, ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపాల్ తెలిపారు. ఉదయం నుంచి ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందజేయడం జరిగిందన్నారు. మాడుగుల, వీరవల్లి,కోటపాడు, వీరనారాయణం, ముకుందపురం, జి.అగ్రహారం, గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ పర్యవేక్షించారు. మిగిలిన వారికి పింఛన్లు 2వ తేదీన పంపిణీ జరుగుతుందన్నారు.

మాడుగుల రూరల్ : మండలంలో 11,767 మంది పింఛనుదారులకు గాను శనివారం 11,062 మందికి పింఛన్లు పంపిణీ చేసి, 93.92 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.వి.ఎస్.గోపాలరావు శనివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మరో 705 మందికి సెప్టెంబరు 2 వ తేదీన పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. గిరిజన గ్రామాల్లో సైతం ఉదయం 10 గంటలకే శత శాతం పింఛన్లు పంపిణీ పూర్తయింది.

బుచ్చెయ్యపేట : మండలంలో గల 35 పంచాయతీల్లో 10,691 పింఛన్లకు గాను శనివారం 10,134 మందికి పింఛను నగదు అందించినట్టు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు.

బుచ్చెయ్యపేట,వడ్డాది తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీని జిల్లా పంచాయితీ అధికారి శిరీషారాణి పరిశీలించారు. జోరు వర్షంతో పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి అధికారులు అవస్థలు పడ్డారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



కృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న త్రైత సిద్ధాంత భక్తులు

మాకవరపాలెం : అడిగర్లపాలెంలో ఏటా త్రైత సిద్ధాంత భక్తులు కృష్ణాష్టమి రోజున కృష్ణుడి ప్రతిమతో మండపం ఏర్పాటు చేసి వారం రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా కృష్ణుడికి పూజలు నిర్వహించి శనివారం సాయంత్రం అడిగర్లపాలెం, పోతలూరు, మామిడిపాలెంలో ఘనంగా ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చినదేముడు, సూరిబాబు మాట్లాడుతూ భగవాన్ స్వామి ఆచార్య ప్రబోధానంద యోగేశ్వరులు ప్రతిపాదించిన త్రైత సిద్ధాంతంలో ప్రతి జీవరాశి మూడు ఆత్మల ఆధారంగా జీవిస్తున్నాయన్నారు. మనుషులకు దేవుడు జ్ఞానాన్ని ఇస్తే, మనుషులు కులమతాలను ఏర్పారుచుకున్నారనే విషయాన్ని తెలియజెప్పేదే త్రైత సిద్ధాంత భగవద్గీత అని అన్నారు. ఊరేగింపులో కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

కేసుల రాజీకి లోక్ అదాలత్ చక్కని వేదిక



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం: కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు అవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ నెల 14 న జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళితుల పింఛన్లు తొలగింపు అన్యాయం

కౌన్సిల్‌లో గళమెత్తిన మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి



పింఛన్ల తొలగింపుపై మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, టీడీపీ కౌన్సిలర్ పద్మావతి మధ్య వాదులాట

నర్సీపట్నం: తన వార్డులో పింఛన్ల తొలగింపుపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి కౌన్సిల్‌లో అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎజెండా చదివిన అనంతరం మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి దళితుల పింఛన్లు ఎవరు తొలగించారో సమాధానం చెప్పాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్షతో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 17వ వార్డుకు చెందిన దళితులైన 10 మంది పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వారిలో చెప్పులు కుట్టుకునే వారు, రిక్షా కార్మికులు ఉన్నారన్నారు. పేదల పింఛన్లు తొలగించి పొట్టకొట్టడం సరికాదని, ఏకారణంతో తొలగించారో అధికారులు సమాధానం చెప్పాలని అన్నారు. టీడీపీ పార్టీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి జోక్యం చేసుకొని కేవలం ఎస్సీల పింఛన్లు తొలగించారని మాట్లాడడం సరికాదన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. విషయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి తొలగించిన పది మందికి అర్హత ఉంటే పింఛన్లు పునరుద్ధరించి న్యాయం చేస్తామని పద్మావతి పేర్కొన్నారు. అయితే పింఛన్లు ఎవరి ప్రొద్బలంతో తొలగించారో కౌన్సిల్ ముందు పెట్టాలని మాజీ చైర్‌పర్సన్ డిమాండ్ చేశారు. వాహనాలకు వినియోగించే డీజిల్ బిల్లుల్లో అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య ఆరోపించారు. ఈ విషయంపై కమిషనర్ సురేంద్ర స్పందిస్తూ పూర్తి స్థాయిలో ఆడిట్ చేయించి, రుజువైతే సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మున్సిపాలిటీకి రూ.4.11 కోట్లు మంజూరు చేయించారని, ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని, అలాగే కాలువల్లో పూడిక తీయడానికి మరో రూ.45 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ అప్పలనాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దేవరాపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం, ఇది వాయుగుండంగా మారడంతో మూడు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా వుండాలని, అనకాపల్లి ఆర్డీఓ ఎ.చిన్నికృష్ణ తెలిపారు. భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురవచ్చునని వాతావరణశాఖ వెల్లడించడంతో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచనల మేరకు శనివారం సాయంత్రం ఆయన రైవాడ జలాశయాన్ని పరిశీలించారు. జలాశయం ఏఈ డి. నరేశ్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 108.15 మీటర్లకు చేరిందని, 365 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని, జలాశయానికి ఎటువంటి ప్రమాదం లేదని ఏఈ నరేష్ ఆర్డీఓకు వివరించారు. తుపాన్ ప్రభావం కారణంగా మండల, గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సూచించారు. ప్రమాదకరంగా వున్న చెరువు గట్టులను గుర్తించి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు సతీష్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి చిత్రలేఖనం పోటీలు

చోడవరం : విద్యార్థులకు ఈనెల 1వ తేదీన మండల స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని చోడవరం చిత్రకళానిలయం నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ చెప్పారు. ఎల్‌కేజీ నుంచి ఐదోతరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు చోడవరం ప్రేమ సమాజం వద్దకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాని కోరారు. ఒకొక్క అభ్యర్థి రూ.100 ప్రవేశరుసుం చెల్లించాలని తెలిపారు.